ఫాగింగ్ మాటున 'పెట్రో' స్వాహా?


దోమలకు నిలయమైన సరూర్‌నగర్ చెరువు

- పక్కదారి పడుతున్న డీజిల్, పెట్రోలు
- ఫాగింగ్ చేయకపోవడంతో దోమల సమస్య తీవ్రం
- ప్రబలుతున్న డెంగీ జ్వరాలు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో దోమల నివారణ పేరుతో కాలనీలో ఫాగింగ్ చేసే యంత్రాలకు ఉపయోగించే డీజిల్, పెట్రోల్ పక్కదారి పడుతోందనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫాగింగ్‌ను పూర్తిస్థాయిలో చేయకపోవడంతో కాలనీలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమలతో స్థానికులు విష జ్వరాలు, డెంగీ బారిన పడుతున్నారు.

- జోనల్ పరిధిలో సుమారు 400 దాకా డెంగీ కేసులు నమోదు అయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మూడు నెలల క్రితం ఇక్కడికి బదిలీపై వచ్చిన సీనియర్ ఎంటమాలజిస్ట్‌కు కింది స్థాయి ఉద్యోగుల నడుమ సఖ్యత లేకపోవడంతో ఫాగింగ్‌పై పర్యవేక్షణ లేక దోమ కాటుకు పలువురు గురవుతున్నారు.
- దోమల నివారణకు ఉపయోగించే ఇంధనం అధికారులకు మేతగా మారిందని పలువురు బాహాటంగానే ఆరోపిస్తున్నారు.
- ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో 10 పెద్ద యంత్రాలు, డివిజన్‌కు 2 చొప్పున చిన్న యంత్రాలు ఉంటాయి. ఇందుకు గాను పెద్ద యంత్రాలకు రోజుకు 45 లీటర్లు, చిన్న యంత్రాలకు 9 లీటర్ల డీజిల్ ఇస్తారు. ఈ డీజిల్ 60 శాతంకు పైగా పక్కదారి పడుతోందనే ఆరోపణలున్నాయి.
- ఈ విషయంలో అధికారులు భారీగా అవినీతికి పాల్పడుతున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ యంత్రాలు ద్వారా కాలనీలో పొగ పెడుతూ తిప్పుడం వలన ఈ పొగకు కొంత మేరకు దోమలు కోల్పోతాయి. ఈ యంత్రాలను తూతూ మంత్రంగా తిప్పుతూ డీజిల్ పెట్రోలను అమ్ముకుంటూ వాటాలు పంచుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కాలనీలో సరిగా ఫాగింగ్ జరగకపోవడం వలన దోమల వలన పలువురు విషజ్వరాలు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు.
- పెద్ద యంత్రాలకు ఇచ్చే డీజిల్‌లో సగం కొత విధిస్తూ తూతూ మంత్రంగా కాలనీలో ఫాగింగ్ చేస్తున్నారని కాలనీల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- డీజిల్ దోపిడీని అరికట్టేందుకు అధికారుల ముందే వాహనాలలో ఇంధనం నింపితే సరిగా ఫాగింగ్ చేయడం వలన దోమల నివారణ కొంత అయినా తగ్గుతుంది
- కాలనీలో రోజు వారీగా ఎన్ని కిలోమీటర్ల వరకు ఫాగింగ్ చేస్తున్నారో సదరు ఎంటమాలజీ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం వలన దోమలు పెరుగుతున్నాయి.

కిందిస్థాయి సిబ్బందితో సఖ్యత లేనందునే...

కింది స్థాయి అధికారులు సీనియర్ ఎంటమాలజిస్ట్ మధ్య సరిగా అవగాహన లేకపోవడం, కొంత మందిని వద్ద నెలకు మామూళ్లు వసూలు చేయడం జరుగుతోందని యూనియన్ నాయకులు ధర్నాకు దిగడం గమనార్హం. ఉద్యోగుల మధ్య సఖ్యత లేకుండా ఘర్షణ వాతావరణం నెలకొనే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలూ ఉన్నాయి. ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో జరుగుతున్న డీజిల్, పెట్రోల్ దోపిడీపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం...



ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో డీజిల్, పెట్రోల్ పక్కదారి పడుతున్న విషయంపై సీనియర్ ఎంటమాలజిస్ట్ గంగప్ప స్పందించారు. ఈ విషయంపై ఎవరినీ ఉపేక్షించమని.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దోమల నివారణకు చేపడుతున్న ఫాగింగ్ మిషన్లు అన్ని కాలనీలో తిరిగేలా సిబ్బందిని అప్రమత్తం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

- గంగప్ప, సీనియర్ ఎంటమాలజిస్ట్

క్లుప్తంగా

సచివాలయనగర్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తా

కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీలలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిరించేందుకు తన వంతు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన సచివాలయనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కూర్మారావు ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఆదివారం కార్పొరేటర్ లచ్చిరెడ్డిని కలసి సన్మానించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ... సచివాలయనగర్ కాలనీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కాలనీ ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, ఉపాధ్యక్షులు సాంబశివరావు, రవికుమార్, గోపాల్‌రెడ్డి, శ్రీధర్‌కుమార్, బాల్‌రెడ్డి, సూర్యనారాయణ, రవి, ఆంజనేయులు, నర్సింహ్మారెడ్డి, జనార్దన్‌రావు, సీతరామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న కాలనీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీ అధ్యక్షుడు గొరిశెట్టి చంద్రశేఖర్‌ను కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ... వాసవికాలనీ, వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో ఆధ్యాత్మికను పెంపొందించడానికి చంద్రశేఖర్ ఎంతో కృషి చేశారన్నారు. కాలనీ నాయకులు అయిత అంజయ్య, శ్రీధర్, సి.ఉపేందర్‌రెడ్డి, కృష్ణయ్య, రామస్వామి, కృష్ణమూర్తి, అనీల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సందడిగా ముగ్గుల పోటీలు

నాగోలు: కొత్తపేట డివిజన్ జైన్ మందిర్ వద్ద బీఆర్ఎస్ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, మారుతినగర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన దేవిరెడ్డి కమల సుధీర్‌రెడ్డి అందంగా ముగ్గులు వేసిన మానసకు మొదటి బహుమతి, అనితకు రెండవ బహుమతి, వరలక్ష్మికి ముడవ బహుమతి అందజేశారు. మున్సిపాల్ మాజీ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు మల్లేశం, కామేశ్వరరావు, మురళీధర్‌రావు, శ్రీశైలంగౌడ్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు దేవిరెడ్డి శ్వేతారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయగౌడ్, సునీల, రూపాసింగ్, పద్మ, అనురాధ, కొమ్ముబాబు, సతీష్, తాళ్ల నర్సింగ్‌గౌడ్, గంజి విజయ్, శ్రీను, శశి, అమిత్, విష్ణు, బంటి పాల్గొన్నారు.

మంత్రి సబితపై కరపత్రాల కలకలం

బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

మహేశ్వరం: మంత్రి సబితాఇంద్రారెడ్డిపై సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి పేరిట వెలిసిన కరపత్రాలు కలకలం రేపాయి. అయితే.. ఈ కరపత్రాలపై బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. కరప్రతాలను దహనం చేశారు. దీంతో మహేశ్వరం నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. వివరాలు.. ఆదివారం తెల్లవారుజామున నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కార్పొరేటర్ అనుచరులు కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేశారు. దాదాపు లక్షకు పైగా కరపత్రాలు పంపిణీ చేసినట్లు తెలిసింది. మహేశ్వరం నియోజకవర్గానికి మంత్రి సబిత చేసిందేమి లేదని, అభివృద్ధి మాట దేవుడెరుగు కానీ.. ఆమె ఆస్తులు మాత్రం బాగా పెంచుకున్నారని ఆరోపించారు. సరూర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి ఇప్పటి వరకు ఎలాంటి నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఇందుకుగాను వచ్చే ఎన్నికల్లో మంత్రిని ఓడించాలని అందులో పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న మంత్రి అనుచరులు, బీఆర్ఎస్ నాయకులు కార్పొరేటర్ శ్రీవాణిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌరస్తాల్లో కరపత్రాలను దహనం చేశారు. శ్రీవాణికి వ్యతిరేకంగా, సబితకు అనుకూలంగా నినాదాలు చేశారు. అలాగే.. ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో నిలిపివేయనున్నట్లు డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు రెయిన్‌బజార్ చమన్, కార్నర్ టీ పాయింట్, గాంధీకా పుత్లా, మస్కతీ పార్క్, మినాజ్‌బేకరి, డెక్కన్ ఫంక్షన్‌హాల్, వివేకానంద స్కూల్, దరాబ్‌జంగ్ కాలనీ, రజానగర్, రెయిన్‌బజార్, శ్రీనగర్‌కాలనీ, నెహ్రూనగర్, రామచంద్రా నగర్, ఎంబీ హట్, క్రీడా, న్యూ అండ్ ఓల్డ్ అర్చన, ఐఎస్‌సదన్ రోడ్, సైదాబాద్ మెయిన్‌రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు షాన్‌బాగ్ ఫంక్షన్‌హాల్, ఆర్‌కే హోటల్, రజానగర్, యశ్రాఫ్‌నగర్, సాదత్ నగర్, సమీనా హాస్పిటల్, జవహర్ పురా, మౌలానా ఆజాద్ నగర్, ఈదీబజార్ రోడ్, బన్నాక, అన్మోల్ హోటల్, సీతమ్మతోట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామని డీఈ వివరించారు.

బస్తీ దవాఖానాలతో మెరుగైన వైద్యం


బస్తీ దవాఖానా నిర్మించే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ప్రతి బస్తీలో బస్తీ దవాఖానాలను నిర్మిస్తోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సర్వే నెం 58లో నిర్మించే నూతన బస్తీ దవాఖానా స్థలాన్ని ఆదివారం ఉప్పల్ తహసీల్దార్ గౌతమ్‌తో కలసి సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలోనే ఈ స్థలంలో బస్తీ దవాఖానా మంజూ అయిందని అయితే ఆ స్థలం తమదన ప్రైవేట్ వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో జాప్యం జరిగిందని తెలిపారు. సదరు వ్యక్తితో సంప్రదింపులు జరిపి కోర్టులో కేసు వెనక్కు తీసుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులతో కలసి బస్తీ దవాఖానా నిర్మించే స్థలంలో హద్దులను నిర్ణయించామని త్వరలో దవాఖానా నిర్మాణం చేపడతామని తెలిపారు. దీంతో పాటు బస్తీలో కమ్యూనిటీ హాల్ కూడా నిర్మిస్తామని హామిచ్చారు. అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకారించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అనంతుల రాజిరెడ్డి, తూర్పాటి చిరంజీవి, సుర్వి రాజు, కవిత, కృష్ణ, నారాయణమ్మ, మరియమ్మ, విజయ, ప్రభాకర్, రాఘవాచారి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరిస్తే రెట్టించిన ఉత్సాహంతో అభివృద్ధి చేస్తా

- మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రజలు సహకరిస్తే అభివృద్ధి విషయంలో తాను రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి డివిజన్‌ను మరింత అభివృద్ధి చేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మల్లికార్జుననగర్‌కాలనీ, అమ్మదయకాలనీలలో ఆదివారం ఆయన మార్నింగ్ వాక్ చేపట్టి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... అమ్మదయకాలనీ అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు పూర్తిచేస్తానని తెలిపారు. కాలనీలో బర్రెల దొడ్లు ఎక్కువగా ఉండటంతో పందుల సంచారం పెరుగుతుందని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారని, సమస్యను పరిష్కారిస్తానన్నారు. కాలనీలలో చెడిపోయిన మ్యాన్‌హోల్స్ కవర్స్‌ను తొలగించి నూతన కవర్లను ఏర్పాటు చేయిస్తానన్నారు. కాలనీలలోని డ్రైనేజీ సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని తెలిపారు. నేతలు శంకర్, శ్రీశైలం, చంద్రారెడ్డి, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్, సత్తయ్య పాల్గొన్నారు.

కాలనీల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తా


సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న కూర్మారావు తదితరులు

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీలలో నెలకొన్న సమస్యలను సత్వర పరిష్కారానికి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎల్‌బీగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని నూతనంగా ఎన్నికైన సచివాలయనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కూర్మారావు ఆధ్వర్యంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో స్పోర్ట్ స్టేడియం, డ్రైనైజీ, రోడ్లు తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన సుధీర్‌రెడ్డి సచివాలయనగర్ కాలనీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందర్‌రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, ఉపాధ్యక్షులు సాంబశివరావు, రవికుమార్, గోపాల్‌రెడ్డి, శ్రీధర్‌కుమార్, బాల్‌రెడ్డి, సూర్యనారాయణ, రవి, ఆంజనేయులు, నర్సింహారెడ్డి, జనార్దన్‌రావు, సీతరామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా శంకర్‌నాయక్

సైదాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శిగా ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణికాలనీకి చెందిన నేనావత్ శంకర్‌నాయక్ నియమితులయ్యారు. ఈమేరకు గాంధీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌నాయక్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం సింగరేణికాలనీలో ఆయన మాట్లాడుతూ... గిరిజనుల్లో రాజకీయ అవగాహన కలిగించి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలిచి తెలంగాణలో అధికారంలోకి వచ్చేలా నాయకులు, కార్యకర్తలతో కలిసి కృషి చేస్తానన్నారు. గిరిజనుల సంక్షేమానికి ఎల్లప్పుడూ పాటుపడుతానన్నారు. ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా అవకాశమిచ్చిన అధ్యక్షుడు జగన్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పౌరాణిక ఔన్నత్యానికి భారతీయ నృత్యాలు నిదర్శనం

సైదాబాద్: చక్కటి భావవ్యక్తీకరణతో ప్రదర్శించే భారతీయ నృత్యాలు పౌరాణిక ఔన్నత్యాన్ని చాటుతున్నాయని శ్రీ వేంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ వై.ఎస్.ఆర్.మూర్తి పేర్కొన్నారు. గాయత్రి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్, శ్రీవేంకటేశ్వర ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో లక్ష్మీనగర్ కాలనీలోని భక్తజమాజంలో నిర్వహించిన కళార్చన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. గాయని యడవల్లి కామేశ్వరి జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో ప్రముఖ నర్తకి సుజాత చక్రవర్తి భరతనాట్యం, నృత్య కళాకారిణి రావూరి గీతిక కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆహుతులను అలరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నృత్య కళాకారిణులు తమ హావభావాలతో పౌరాణిక విశేషాలను పామరులకు సైతం అర్థమయ్యేలా ప్రదర్శించడం అభినందనీయమన్నారు. అనంతరం కమిటీ సభ్యులు కళాకారులను సత్కరించారు. డిఫెన్స్ ల్యాబ్ మాజీ సాంకేతిక అధికారి రామానుజరావు, డాక్టర్ జ్యోతిశేఖర్, లీడ్ ఇండియా విద్యాసంస్థల కరస్పాండెంట్ సత్యప్రకాష్ యాదవ్, వేదుల కనకదుర్గ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన అవసరం

- రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి సుశీంద్రరావు

మలక్‌పేట: చదువుతో పాటు విద్యార్థులకు దేశ సంస్కృతి సాంప్రదాయాల విశిష్టతపై అవగాహన పెంపొందించాలని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి సుశీంద్రరావు అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ రవీంద్ర భారతి పాఠశాల వార్షికోత్సవం 'రవీంద్ర దర్పన్-23' పేరుతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ... లక్ష్యాలను ఎంచుకుని చదివితే ఉన్నత శిఖరాలు చేరుకుంటారన్నారు. విద్యార్థుల నాటికలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. జోనల్ ఇన్‌చార్జి బాబురావు, జోనల్ డీస్ జ్యోతి, డీవి దయాకర్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

మల్లన్న జాతరకు ఘనంగా ఏర్పాట్లు


జాతరకు ముస్తాబైన మల్లికార్జున స్వామి ఆలయం


కొలువుదీరిన మల్లన్న స్వామి

- ఈ నెల 11 నుంచి 14 వరకు ఉత్సవాలు
- ఆలయ ఈఓ సత్యనారాయణ

సైదాబాద్: స్వయంభుగా వెలసిన కరణ్‌బాగ్ మల్లన్నస్వామి జాతను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.ఎస్.వి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సైదాబాద్ డివిజన్ కరణ్‌బాగ్‌లోని శ్రీమల్లికార్జున స్వామి దేవాలయం హైదరాబాద్‌లోని అత్యంత పురాతన దేవాలయాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిందన్నారు. సుమారు నాలుగు శతాబ్దాల చరిత్ర ఉన్న ఈ దేవాలయంలో స్వామివారు స్వయంభూగా వెలిశారని భక్తుల విశ్వాసమన్నారు. ప్రతి సంవత్సరంలానే ఈ సంవత్సరం కూడా మల్లన్నస్వామి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ నెల 11 నుంచి 14 వరకు మూడు రోజులపాటు నిర్వహించే వేడుకలు సరూర్‌నగర్‌కు చెందిన ఒగ్గుపూజారి మారయ్య, ఆయన బృందంచే జరుగుతాయని ఈఓ వివరించారు.

- ఈ నెల 11న తెల్లవారుఝూమున స్వామి వారి మేలుకొలుపు, అభిషేకం, బిల్వార్చనలతో జాతర ప్రత్యేక కార్యక్రమాలు మెదలవుతాయని తెలిపారు.
- మధ్యాహ్నం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తారు. సాయంత్రం గంగతెప్ప, మల్లన్న స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తారు.
- రెండవరోజైన 12న మధ్యాహ్నం శ్రీ బలిజ మేడలాదేవి, శ్రీ గొల్ల కేతమ్మ సమేత శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం పటం, అగ్నిగుండాలు, గొలుసు తెంపడం కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- చివరిరోజైన 13న శ్రీ రేణుకా ఎల్లమ్మ, శ్రీ నల్ల పోచమ్మ, శ్రీ మహంకాళి అమ్మవార్లకు బోనాలు సమర్పించడంతో జాతర వేడుకలు ముగుస్తాయి' అని ఈఓ వివరించారు. అనంతరం ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, కొత్త గాజులు పంపిణీ చేస్తామన్నారు. మల్లన్నస్వామి జాతర వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని జాతర జయప్రదం చేయాలని ఈఓ కోరారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యం: పీఆర్‌టీయూ

చంపాపేట: ఉపాధ్యాయుల సంక్షేమమే తమ లక్ష్యమని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం చంపాపేటలోని కర్మన్‌ఘాట్ శ్రీ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ సమావేశ మందిరంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్, స్టిక్కర్స్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ... త్వరలో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల విషయంపై ప్రభుత్వ ఆమోదంతో స్పష్టమైన ప్రకటన జారీ చేయటం జరుగుతుందన్నారు. హెచ్‌ఆర్‌ఏ మంజూరు, 317 జీఓ వల్ల ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయ సమస్యలపై సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా గుర్రం చెన్నకేశవరెడ్డిని ఉపాధ్యాయులందరూ అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తం, సంఘ రాష్ట్ర నాయకులు మహేందర్‌రెడ్డి, కమలాకర్, కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, వెంకటరెడ్డి, పద్మావతి, బాషా పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి వార్షికోత్సవం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల, పక్కన పాస్టర్ ప్రభుచరణ్

మలక్‌పేట: మూసారంబాగ్‌లోని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి క్వాయర్ టీమ్ వారు స్తుతిగీతాలతో ఏసుక్రీస్తును ఆరాధించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల మాట్లాడుతూ... క్రైస్తవులకు అన్ని విధాలా అండగా నిలబడతామని పేర్కొన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. చర్చి ఫౌండర్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎం.ఎస్ ప్రభుచరణ్ వ్యాకోపదేశం చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్, ఇంటర్నేషనల్ స్పీకర్ వన్య ఇమ్మానుయెల్ అధ్యక్షతన జరిగిన ఉత్సవంలో ప్రేమవిందు ఏర్పాటు చేశారు. టీఆర్ఎస్ నేత తీగల అజీత్‌రెడ్డి, పెద్ద ఎత్తున క్రైస్తవులు, పాల్గొన్నారు.

సందడిగా నాగార్జున పాఠశాల వార్షికోత్సవం

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని నాగార్జున ది నెక్స్ జెన్ ఉన్నత పాఠశాల తొమ్మిదవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించా. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన వేంకటేశ్వర స్వామివారి కల్యాణం, పర్యావరణ పరిరక్షణ, బాలికా సంరక్షణ వంటి నృత్యాలు చూపరులను కట్టి పడేశాయి. అనంతరం గత ఏడాది పదవ తరగతిలో జీపీఏ 10 పాయింట్లు సాధించిన విద్యార్థులకు నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మికొండ విఠల్‌రెడ్డి చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ రజనీ విఠల్‌రెడ్డి, డైరెక్టర్‌లు సీహెచ్ వీణా, సంగమేశ్వర్‌గుప్త, మనీషా, శేషారావు, డీన్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ కట్టా రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజేష్‌కు జాతీయ విశిష్ట సేవా పురస్కారం


రాజేష్‌ను సన్మానిస్తున్న శ్రీనాథశర్మ, బాల్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: పుడమి సాహితీ వేదిక తెలంగాణ నాలుగవ వార్షికోత్స వేడుకలు నల్లగొండ చిట్యాలలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో పుడమి సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు చిలుమూరి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని విద్యా, వైద్య, కళా, సామాజిక రంగాలలో మూడు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న వారిని సన్మానించారు. అందులో ఆర్‌కేపురంలోని అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్‌కు పుడమి సాహితీ జాతీయ విశిష్ట సేవా పుస్కారం–2023ను ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీనాథ మహాకవి వారసులు డాక్టర్ శ్రీనివాస శర్మ, పుడమి సాహితి జాతీయ అధ్యక్షుడు బాల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో భక్త రామదాసు వారసులు కంచర్ల శ్రీనివాసరావు, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత డాక్టర్ సుబ్రమణ్యం, శివశంకరయ్య, చిట్యాల మున్సిపల్ చైర్మన్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైస్ ఏటీఎంకు అనూహ్య స్పందన


కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న సామాజిక కార్యకర్త రాము

మన్సూరాబాద్: కరోనా కల్లోల సమయంలో పేద ప్రజలు పస్తులు ఉండకూడదనే ఉద్దేశంతో రైస్ ఏటీఎంను ప్రారంభించామని, నేటికి వెయ్యి రోజులు పూర్తయ్యినందుకు సంతోషంగా ఉందని సామాజిక కార్యకర్త, రైస్ ఏటీఎం నిర్వాహకుడు దోసపాటి రాము అన్నారు. రైస్ ఏటీఎంను ఏర్పాటు చేసి వెయ్యి రోజులు పూర్తయ్యినందుకు నాగోల్ డివిజన్ పరిధి రాక్‌హిల్స్‌కాలనీలోని రైస్ ఏటీఎం వద్ద ఆదివారం మహిళలకు కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ... రైస్ ఏటీఎం ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు సుమారు లక్షకుపైగా కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరకులను ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. కరోనా సమయంలో పలు కుటుంబాలు జీవనోపాధి కోల్పోయారని గ్రహించి ప్రాజెక్టు ప్రిషాను ఏర్పాటు చేసి 1800 కుటుంబాలకు జీవనోపాధి కల్పించామని వివరించారు. ఈ ప్రయాణంలో సహకారం అందించిన వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఎమ్మెల్యే వ్యాఖ్యలపై దర్యాప్తు చేయండి'

లింగోజిగూడ: ద్వంద్వ ఓట్లు కలిగి ఉండాలంటూ ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. వివారాలివీ... గత సంవత్సరం మునుగోడు ఉప ఎన్నికలప్పుడు ఎల్‌బీనగర్‌లో నివాసం ఉండే మునుగోడు ఓటర్ల కోసం ఎల్‌బీనగర్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎల్‌బీనగర్, మునుగోడులో ఓట్లు ఉన్న ఓటర్లను ఉద్దేశించి రెండు చోట్ల ఓట్లు ఉంచుకోవాలని వచ్చే సాధరణ ఎన్నికలలో రెండు చోట్ల ఓటు వేయాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నట్లు పలు సామాజిక మధ్యమాలు, వీడియోలు, వార్తా పత్రికలలో కథనాలు ప్రసాచం, ప్రచురితం అయ్యాయి. వీటి ఆధారంగా కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులకు సుధీర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పరిశీలించిన ఎన్నికల ప్రధాన కార్యాలయం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి సుధీర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారికి ఆదేశాలు జారీ చేశారు.

హర్షం వ్యక్తం చేసిన దర్పల్లి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై దర్యాప్తునకు ఎన్నికల సంఘం ఆదేశించడం పట్ల కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఓటర్లను ప్రలోభ పెట్టడానికి ప్రయత్నించడం చట్ట విరుద్ధమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముగ్గుల పోటీలకు స్పందన

మన్సూరాబాద్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని శివహిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు సందడిగా జరిగాయి. కార్యక్రమానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముగ్గుల పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన రేణుక, రెండవ, మూడవ స్థానంలో నిలిచిన విజయలక్ష్మి, గాయత్రిలకు బహుమతులను ప్రదానం చేశారు. కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రఘునాథ్, కోశాధికారి దామోదర్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, మహిళామోర్చా నాయకులు నందికంటి గీతారెడ్డి, కవితారెడ్డి, యాదగిరి యాదవ్, ఎంజాల జగన్, పాతూరి శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.